# ముఖారవిందం

ఎప్పుడూలేంది, ఆ రోజున ఆరు కాకుండా మెలుకువొచ్చిందినాకు. గ డి కి టి కీ లోంచి చల్లని తెమ్మెరలు వచ్చి శరీరాన్ని మృదువుగాతాకుతున్నాయ్. బద్దకంగా లేచి వళ్ళు విరుచుకుని కిటికి దగ్గరకెళ్ళి బయటకి చూడనారంభించాను. కింద ఎదు రుగుండా నూతిదగ్గర, ఒకమ్మాయి, పదిహేనేళ్ళకంటే ఎక్కువవుండవు, నీళ్ళుతోడు తుంది. తెల్లారి లేవగానే ఎంత అందమైన మొహం చూశాను! నాకు చాలా సంతో షమనిపించింది. నాకు తెల్లారిలేవగానే ఎవరి ముఖమన్నా చూడ్డమంటే పెద్దభయం కారణం— ముఖాన్ని బట్టిఆరోజు తీరువుంటుందని నాకున్న ఒకానొక గట్టి నమ్మకం అందుకే ఈ విషయంలో చాలాజాగ్రత్తగా వుంటాను. అలాంటిదె యె ం దు కో ఈవేళిలా జరిగింది.

ఎంత లేతవొళ్ళు! ఎప్పుడూలేంది ఇవాళ నీళ్లుతోడేందుకు ఎందుకొచ్చిందో? ....పాపం! పాపం వెళ్ళి సాయంచేద్దామనిపించి ఆ తలుపుని అతికష్టంమీద తెరు చుకున్నాను. అలాగే నిలబడ్డాను, కిటికీలోంచి వచ్చే చల్లనిగాలిని తింటో. బిందె నిండింది.. బిందె చంక నెత్తుకొని వయ్యారంగా నడుస్తూ వెళిపోయింది. ఆ లేత నడుం అల్లల్లాడుతుంటే మనసెందుకో వల్లో చిక్కింది, వెళిపోయింది గదా అని మనస్సు చివుక్కుమంది. మళ్లా వస్తుందేమోనని యింకాస్సేపక్కడే నిలబడ్డాను. బ్రష్ తీసుకుని పళ్ళు తోముతూ యినాళ్ళనించీ ఆ రూంలో వుంటున్న నాకు తెలి యని ఆ పిల్ల ఎవరయివుంటుందా అని ఆలోచిస్తే, యింకొంతకాలం ఆ కిటికీ దగ్గరే తచ్చాడాను. మళ్లా ఆ పిల్ల రాలేదు.

ఇంతందంగా వున్న మొహాన్ని ఉదయమే చూశాను గనక, ఆ రోజు తీరు ఇంకెంత బావుండాలి అంటూ లెక్కలుకట్టుకోవడం ప్రారంభించాను. మొదటిది.... మనియార్డరు. దానికోసం మూడ్రోజుల్నుంచీ ఎదురుచూస్తున్నాను. యి వా ళ రావొచ్చు, రెండు....యింకా యేవేవో 'ఆన్సర్లు' దొరికినాయ్.

నా పక్కగదిలో వుంటున్న పంచముఖేశ్వరరావు-యించుమించు ఏడుస్తూ బయటికొచ్చేడు. కు ళా యి దగ్గిర స్నానం చేస్తున్న నేను 'అలా వున్నావేరా?' అనడిగాను, సంతోషంగా.

"అబ్బే! ఏంలేదురా! ఆ దొంగ వెధవ—లేవగానే ఆ దరిద్రపుగొట్టు వెధవ ముఖంచూశాను. ఏం జరుగుతుందో ఏమోనని భయంగావుంది. దుమ్మలగుండులా గుండు ముఖమూ వాడూనూ...."అన్నాడు. నిద్రమత్తులోంచే భోరున ఏడస్తూ.

నేను గొల్లున నవ్వాను. బిత్తరపోయిచూశాడు.

"యివ్వాళ నేను....వ్వెరీ బ్యూటిఫుల్ ఫేస్ చూశాననుకో. లైఫ్ లో యింతకు క్రితం చూళ్ళేదు. యికముందు చూడబోను. యిందాకే చూశాను."

ఊరించాను.

"ఎవర్రా అది"? అన్నాడు ఆతృతగా, మొహం చేటంతవేసుకుని, ఆవలిస్తూ "ఓ యంగ్‌గర్ల్-ఎదురుగావున్న 'వెల్' దగ్గిర 'వాటర్' తోడుతూ కన్పించింది.

తనకా 'బ్యూటీఫుల్ యంగ్ గర్ల్'ని చూసే భాగ్యం పోయినందుకూ, పైపెచ్చు ఆ 'దుమ్మలగుండు మొహం' చూసినందుకూ--రెండు విధాల వాడి బాధ మళ్ళీ అంతట్లోనే ఆ మొహం జ్ఞాపకం వచ్చిందిగావును-యేడుపు మొహం [వాడు చూసిన మొహం కంటె వికృతంగా] పెట్టాడు.

నాకు బోల్డంత మెర్సీ వేసేసింది.

'ఆఁ గాడిదగుడ్డు పొన్లెద్దూ. అదంతా జరుగుతుందా? యేడుస్తుందా? ఏదో పూర్వాచారం....! యిప్పుడటువంటివి పోయాయ్. యాడొకు. యాడొకు' అని ఓదార్చాను, తుండుగుడ్డ పిండుకుంటూ.

తనకి దానిమీద అంతచేటు నమ్మకం కలగటానికి గల కారణాన్ని సోదాహరణంగా వివరించాడు. ఒకసారలగే ఏదో ఉద్యోగానికి 'యింటర్వ్యూ'కి వెళ్ళే రోజున ఒక పాకీపిల్ల మొహం చూశాట్ట. ఆ రోజు వుద్యోగం రాలేదట. మళ్లా పైచదువుకు కాలేజీలో చేరాడట!?

నాకు మనసులో లోలోపల సంతోషం పొంగిపొర్లుతోంది. ఎంతపడితే అంత సరదాగావుంది,మనియార్డర్రొచ్చేసినట్టు. అన్నట్టుచెప్పడం మర్చిపోయాను ఈ మధ్యనే ఓ కథరాసి 'కథాంజలి'కి పంపించాను. అది అచ్చయినట్టూ-కొంత డబ్బు ముట్టినట్టూ-ఏవేవో ఊహలు అలా రేగుతున్నాయ్....

హొటలుకు వెళ్ళి 'టీ' తాగి మళ్ళీవచ్చి లాడ్జీలో కూచున్నాను. టైముకాగానే భోజనంచేసి కాలేజీకి బయల్దేరాను. పక్కరూం పంచముఖేశ్వరరావుగాడు_ కాలేజికి రాలేదు. కాఫీతాగడానిక్కూడా వెళ్ళలేదు ఉదయంనుంచీ. కాలు కదిపితే ఏ అవాంతరం వొస్తుందోనని భయపడి పోయాడనుకున్నాను.

నేను వెళ్ళేసరికి కాలేజీ నోటీసుబోర్డు దగ్గిర గుంపు కనిపించింది. అడిగితే ఎవరో బి.యీ.డీ. స్టూడెంటు అకస్మాత్తుగా చచ్చిపోయిన కారణంగా ఆ రోజు 'లోకల్ హాలీడే' యిచ్చినట్టు చెప్పారు. ఆ రోజు మా కున్న జిడ్డు 'జి.యి.' పిరీయడు పోయినందుకు సరదా పట్టలేక కిళ్ళీ నముల్తూ లాడ్జికి బయయిదేరాను.

కాలేజీకి ఏదోవిధంగా సెలవు రావడం, పైగా జి. యి. పి రి య డ్ పోవడం-యీరెంటినీ-'తత్స'ంబంధమైన 'మంచి' కింద జమ కట్టుకున్నాను.

తెలుగు ఓల్డు పొయెట్రీ, చదవడం ప్రారంభించాను, ఆ అమ్మాయిని తలచుకుంటే ఏంజరిగిందో తెలియదుగాని తెలిసేసరికి, రిస్ట్‌వాచీ ముళ్ళు మూడును ముద్దెట్టుకుంటున్నాయి; ఫస్ట్‌క్లాస్‌అయిన నిద్రపట్టింది. మనసుకు చాలా హాయనిపించింది. ఈ మధ్య ఎన్నడూ అంత చక్కని నిద్రపట్టలేదు. దీన్ని మూడో 'మంచి'గా జమకట్టేశాను. లేచి కొళాయి దగ్గిర మొహం కడుక్కొని కాస్త మంచి బట్టలు వేసుకున్నాను. అప్పణ్ణించి యిప్పటివరకూ 'పంచముఖేశ్వరుడి' గది తెరవబడినట్టులేదు. 'పిచ్చి వెధవ పాపం' అనుకుని జాలిపడేశాను. సరిగ్గా గదికి తాళం వేస్తోంటే, నిద్ర మొహంతో బయటికొచ్చాడు, గోక్కుంటూ.

"ఏమిట్రా! మరీ భయపడి పోతున్నావ్! పరవాలేదులే. నువ్వు మరీ వాదస్తపువాడిలాఉన్నావ్!"అన్నాను-నా అదృష్టాన్ని మరోసారి మననం వేసుకుంటూ

వాడా మాటలు వినిపించుకోలేదు.

చివరికి, ఆవలిస్తూ అన్నాడు—

"అన్నట్టు చెప్పడం మర్చిపోయాను. నీకు మనియార్డరొచ్చింది. అరవై నువ్వు కాలేజీకెళ్ళినప్పుడొచ్చింది. మనియార్డరు రేపుపుచ్చుకుందువుగానిలే పోనీ"

"య్యేవిటీ? అన్నాను.

ఆ మనియార్డరు కోసం ఎన్నాళ్ళనుంచో-స్వాతిచినుకులకి ముత్యపు చిప్పలాగ-నోరావలించుకూర్చున్నాను.

"మరి రాగానే చెప్పావ్ కాదే? వెంటనే పోస్టాఫీసు కెళ్ళి పుచ్చుకుందును. యిప్పుడెలాగ? రేపు వాడు వచ్చిందాకా ఆగాలా? ఆ కాస్తచెప్పినంతట్లో అరిగిపోతావా" అని వాడిమీద ఫైర్ అయ్యాను.

"ఓహెూ హెూ ఇది మరీబావుంది. యివ్వాళేమి అఘాయిత్యం ముంచుకొస్తుందోనని నేను హడిలి చస్తుంటే-నీ యెగురుడేమిటి మధ్య?"

యిక ఆట్టే ఆలస్యం చేస్తే లాభంలేదు. యిప్పటికప్పుడే నాలుగైపోయింది. వాణ్ణి విసుక్కుంటూ గబ గబా బయల్దేరాను-పోస్టాఫీసుకి. దార్లో తిరుమలరావు కనిపించాడు. బ్రతిమాలగా బ్రతిమాలగా ఓ అరగంటకి అనుగ్రహించాడు బాతాఖానీనుంచి. వాడెప్పుడూ అంతే లెండి-రెండు గంటలకి తక్కువ బాతాఖానీ వాడి 'డిగ్నిటీ'కి భంగం.

మహా'రష్'గా వెళ్తున్నాను. నాలుగున్నరమించితే మరి ఇవ్వడులావుంది. ఎవడయినా ఒక సైకిలిచ్చినా బావుణ్ణు.... సైకిల్‌కి డాష్....!అదినాకు డాష్ ఐందో

గానికి నేనే డాష్ అయ్యానో నాకుమటుకు తెలీదు. కాలుబెణికింది "ఇన్ ఎడిషన్ టు దట్" నయాపైసా ప్రిమాణంలో చిన్న పెచ్చు ఊడింది. పోలీసు పరుగెత్తి కొచ్చాడు-లాఠీ ఎగరేసుకుంటూ [అది వాళ్ళ మామూలేగా]....యింకెందుకదంతా చెప్పడం. నానా ఖంగాళీ అయింది. ఐదు దాటుతోందగా నేనగేటలోంచి అతికష్టంమీద దాటుకున్నాను. టిఫిన్‌కని దాచుకున్న పావలాకాసుతో రిక్షాఎక్కా "లాడ్జీ" కొచ్చిపడ్డాను. మూతి బిగించేసుకొని పుస్తకం తెరచి చదివేస్తున్నాను.

కోపం-రోషం-అసహ్యం-బాధ-అన్నీ....అన్నీ....—

పంచముఖేశ్వరరావుగాడు బెదుర్తూ బెదుర్తూ హొటల్‌కువెళ్ళాడు-మెక్కేందుకు. కారేజీ వచ్చిందినాకు. ఈ పూటతో టికెట్టయిపోయిందని చెప్పింది సీత. ఖర్మ! యేం చేస్తాం???

పంచముఖేశ్వరరావుగారు యెప్పుడొచ్చారో ఏమో-చప్పుడుకాకుండా లోపలికిపోయి తలుపు మూసుకున్నాడు. కాస్సేపుండి యేంచేస్తున్నాడో చూద్దామని వెళ్లాను. తలుపు చేరేసుకుని నోట్లు లెక్కపెడుతున్నాడు.

కరెన్సీ! కట్ట!....నో(....ఓ(....ఓ(....ట్లు-ఎక్కడివి?

గబగబా ఎదురుగావున్న గోడకివున్న కాళీకాదేవి కాలెండరుముందు మోకరిల్లి అతి చిన్నస్వరంలో విన్నవించుకోవడం ప్రారంభించాడు.

"దేవీ! దివ్యసంధాయినీ! యివ్వాళ ఆ-దుమ్మలగుండుగాడి మొహం చూసినందుకు ఏమౌతుందోనని భయపడ్డాను. ఏమీ జరుగలేదు నీ దయవల్ల. దేవీ.... నీదయవల్ల ఏ ఆపదారాలేదు. పైగా యీపందరూపాయికట్ట దొరికింది, పర్సుతో సహా....నీ మహాత్యం....దేవీ! దివ్యమూర్తీ."

వణికిపోతున్నాడు భక్తిభావంతో.

యింకా మెల్లగా గొణుగుతున్నాడు.

"పక్క రూం ప్రిబాకరంగాడికి రేపుకూడా మనియార్డరు డబ్బు చేతబడకుండా చెయ్యి, వాడిదగ్గిర టిఫినుక్కూడా డబ్బులులేవుగావును. నన్నడిగితే ఛస్తే ఇవ్వను. వాడికి కాస్తపొగరు అణచాలి. తప్పకుండా అలా చెయ్యి మాతా! మరో అర్ధణా ఎక్కువ దక్షిణ చెల్లించుకుంటాను....వెధవకి అలాగేకావాలి."

వాడు లోపల భక్తితో, డబ్బుతో వణుకుతున్నాడు. నేనుబయట కోపంతో కసితో, వణుకుతున్నాను.

"ఛూత్! వెధవది! యివ్వాళంతా యింతే....!" మనసు వెనక్కి పరిగెట్టి ఉదయం కనిపించిన పిల్లమొహంలో ఆగింది.

'మంచి'ల కింద జమకట్టుకున్నవన్నీ తిరగేశాను-వరుసగా—

అనవసరంగా ఒక సహచరుడి చావు కబురు విన్నాను. శనిగ్రిహంలా చదువు సంధ్యా లేకుండా పదకొండు నుంచి-మూడుంపావుదాకా నిద్రిపోయినాను. పైపెచ్చు మనియార్డరందలేదు. దెబ్బలుతగిలినయ్, తెల్లారితే నయాపైసా దగ్గిర లేదు. పక్కకు తిరిగితే కాలు కలుక్కుమన్నది.... "అబ్బా"....

అందంగా కనిపించిన ఆ ముఖారవిందం....ఎంతపనిచేసింది? వాడు కోతి లాంటి పప్పురుబ్బే అయ్యరు మొహంచూశాడు. ముఖం! నా ముఖం!

అందమయిన ముఖాలతో యెంత చిక్కు?!

నాకు మంచి పాఠం లభించింది.

అప్పణ్ణుంచి నాకు ముఖాల్లో నమ్మకం పోయింది. అందమయిన వాళ్ళ ముఖాలు కల్మషంతో, కృత్రిమంతో, శనితో—కనిపిస్తున్నాయి!

రచన : 17-7-61 ప్రచురణ ; కథాంజలి, సెప్టెంబరు 1961